క్లుప్తంగా

కసాపురంలో మన్యుసూక్త హోమం



మన్యుసూక్త హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం మన్యుసూక్త హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య మన్యుసూక్త హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శుభకార్యం

శింగనమల: శింగనమల మండలం చిన్నజలాలపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎస్వీ నారాయణ కుమారుడు వివాహ రిసెప్షన్‌కు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై మంగళవారం వధూవరులు నవీన్‌కుమార్, ఉమా శ్రావణిని ఆశీర్వదించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామిరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి, మాజీ డీలర్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశం కోసం వెంటనే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా డిగ్రీ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించకపోతే విద్యార్థుల పరిస్థితి ఏంటని ఆయన ప్రశ్నించారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలోని ప్రభుత్వ హాస్టళ్లలో మెడికల్ క్యాంపులను నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జీఓ.77ను రద్దు చేయాలన్నారు. విద్యా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిశోర్, సమీర్, సాయి, చందూ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దవడుగూరు: సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పుష్పలత సూచించారు. మంగళవారం మండలంలోని మిడుతూరులో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పలువురకి చికిత్స అందించారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ, చికెన్ గున్యా లాంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. సీహెచ్ఓ వెంకటలక్ష్మి, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, సుజాత, హెల్త్ అసిస్టెంట్లు బాలగంగాధర్‌రెడ్డి, శివప్రసాద్, ఏఎన్ఎం సుమలత తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం




డీఎస్పీని సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంతకల్లు: అనంతపురంలో గత శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో ఉత్తమ సేవలకు అవార్డు అందుకున్న గుంతకల్లు డీఎస్పీ ఆముదాల శ్రీనివాస్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. డీఎస్పీ ఛాంబర్‌లో ఆయన్ను కలిసి శాలువా, పూలమాలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో-కన్వీనర్ వై.భీమలింగ, నాయకులు ఎర్రిస్వామి, గోవిందు, రమేష్, మస్తాన్, కిరణ్, రామాంజి, నల్లారెడ్డి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి

తాడిపత్రిటౌన్: మండలంలోని బోడాయిపల్లిలో జూన్ 27న జరిగిన ఇరువర్గాల ఘర్షణలో తీవ్రంగా గాయపడి బెంగుళూరులో చికిత్స పొందుతున్న రంగనాథ్ (50) మంగళవారం మృతి చెందాడు. అతడికి భార్య వరలక్ష్మి, ఐదు మంది పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకొని వచ్చిన నేపథ్యంలో ఎలాంటి గొడవలకు తావు లేకుండా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు.

ప్రయాణం నరకం



గుంతలమయమైన పి.కొండాపురం రోడ్డు

పామిడి: మండలంలోని పీ కొండాపురం రోడ్డు గుంతలమయమైంది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇసుక, గరుసు అక్రమంగా ఈ రహదారి గుండానే తరలివెళ్తుండడడంతో రోడ్డు గుంతలమయమైంది. ఈ రోడ్డు మీదుగా మండలంతోపాటు గుంతకల్లు రూరల్ మండలంలోని గ్రామీణ ప్రాంతాలకు రోజూ వందల్లో వాహనాల రాకపోకలతో బిజీగా ఉంటుంది. అలాంటి ఈ రోడ్డు గుంతలమయమవ్వడంతో ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. పాలకులు, అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించి రాకపోకలను సుగమం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన పారిశుధ్యం

గుంతకల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో అపరిశుభ్రత తాండవిస్తూ కంపు కొడుతుంది. బస్టాండ్ సమీపంలోని దుకాణదారులు, హోటళ్లలోని వ్యర్థాలను బస్టాండ్ ఆవరణలో పడేస్తున్నారు. దీంతో చెత్తా చెదారం పెరిగిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. వివిధ ప్రాంతాలకు వెళ్లడానికి బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కంపు భరించలేకపోతున్నామని వారు వాపోతున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి చెత్తా చెదారాన్ని శుభ్రం చేయించడంతోపాటు స్వచ్ఛతను పాటించాలని ప్రయాణికులు కోరారు.



గుంతకల్లు బస్టాండ్ ఆవరణలో చెత్తా చెదారం పేరుకుపోయిన దృశ్యం

బంగారు చైన్ అప్పగింత



పోగొట్టుకున్న చైన్‌ను భక్తుడికి అందజేస్తున్న ఎస్ఐ టీపీ వెంకటస్వామి

గుంతకల్లు రూరల్: స్వామివారి దర్శనార్థం కసాపురం వచ్చిన భక్తులు పోగొట్టుకున్న బంగారు చైన్‌ను కసాపురం పోలీసులు వెతికి తిరిగి అప్పగించారు. బళ్లారికి చెందిన దానాంజనేయులు అనే భక్తుడు తన భార్య, కూతురుతో నెట్టికంటి ఆంజనేయస్వామి దర్శనార్థం సోమవారం రాత్రి కసాపురం వచ్చాడు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉండటంతో ఆ సమయంలో ఆయన కూతురు మెడలో ఉన్న 1.5 తులాల బంగారు చైన్ జారి కింద పడిపోయింది. వెంటనే కసాపురం ఎస్ఐ టీపీ వెంకటస్వామికి ఫోన్‌లో ఫిర్యాదు చేశాడు. కానిస్టేబుల్ ఓబులేసును అప్రమత్తం చేసిన ఎస్ఐ సీసీ ఫుటేజీలను పరిశీలించాలని సూచించారు. ఫుటేజీల ఆధారంగా కింద పడిన బంగారు గొలుసును ఓ మహిళ తీసుకుని కేసరి సదనం వైపు వెళ్లినట్లు గుర్తించారు. వెంటనే ఆ ప్రాంతానికి చేరుకుని మహిళను గుర్తించి ఆమె నుంచి చైన్ రికవరీ చేశారు. పోగొట్టుకున్న చైన్‌ను మంగళవారం ఉదయం తిరిగి భక్తుడికి అందజేయడంతో.. ఆయన కసాపురం పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక



గార్లదిన్నె మండల కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఏపీటీఎఫ్ జిల్లా నేతలు

అనంతపురం ఎడ్యుకేషన్/గార్లదిన్నె: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) గార్లదిన్నె మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం అనంతపురంలోని ఉపాధ్యాయ భవనంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా ప్రసాద్, గౌరవ సలహాదారుడిగా సి. నాగరాజు, మండల అధ్యక్షుడిగా బి. పర్వతయ్య , ప్రధాన కార్యదర్శిగా మహేష్, జిల్లా కౌన్సిలర్లుగా రంగనాయకులు, కోటి గారి వన్నప్ప , గ్రేస్ విమలమ్మ, అనిల్ కుమార్, నారాయణ స్వామి, మండల ట్రెజరర్ గా బి. బలరాముడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ సిరాజుద్దీన్ హాజరుకాగా, ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షురాలు గాయత్రి , సహాయ ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్ వలి వ్యవహరించారు.

డోలమైట్ ఫ్యాక్టరీలో తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న కర్నూలు రీజనల్ విజిలెన్స్ స్క్వాడ్ ఏడీ వెంకటేశ్వర్లు, సిబ్బంది

యాడికి: మండలంలోని దైవాలమడుగు గ్రామ సమీపంలో ఉన్న ఎర్రితాత మినరల్స్ ఫ్యాక్టరీలోని డోలమైట్‌ను కర్నూలు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మంగళవారం ఉదయం కర్నూలు జిల్లాకు చెందిన రీజినల్ విజిలెన్స్ స్క్వాడ్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ జియాలజిస్ట్ రాజశేఖర్, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సాంబశివారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ దిలీప్‌కుమార్, తాడిపత్రికి చెందిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్ కవిత, సర్వేయర్ ఉమాదేవి ఫ్యాక్టరీలో డోలమైట్‌ను పరిశీలించి కొలతలు వేశారు. డోలమైట్ రవాణాపై ఓనర్ శేఖర్ గౌడ్‌ను ప్రశ్నించారు. అంతకుముందు మినరల్స్ వద్ద ఉన్న కార్యాలయంలోని రికార్డులను వారు పరిశీలించారు. కాగా ఈ నెల 14న కర్నూల్ జిల్లా ఓర్వకల్లు మండలంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలో మూడు లారీలు ఓవర్ హెడ్ లోడు ఉండటమే కాకుండా లోడింగ్ సరుకుకు ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా లేకపోవటంతో డోలమైట్ కార్యాలయాన్ని తనిఖీ చేశామని అధికారులు తెలిపారు.

భూసార పరీక్షలు తప్పనిసరి

గుంతకల్లు రూరల్: రైతులు భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాల ఆధారంగానే ఎరువుల వాడకం చేపట్టాలని ఏఓ లీనా వసుంధర సూచించారు. మంగళవారం మండలంలోని కసాపురం, గుంతకల్లు పట్టణంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవన ఎరువులైన ట్రైకోడర్మావిరిడీ, సూడోమోనస్‌ను రైతులు విరివిగా ఉపయోగించాలని సూచించారు.

పామిడి: మండలంలోని రామరాజుపల్లిలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ విజయ్‌కుమార్ పత్తి, వేరుశనగ పంటల దిగుబడికి పాటించాల్సిన సమగ్ర భూసంరక్షణ యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ డీసీ ముత్యాల్‌రెడ్డి, రైతులు దేవేంద్రరెడ్డి, సుంకిరెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో రైతు శిక్షణ కార్యక్రమం, పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు శిక్షణ కేంద్రం అనంతపురం వ్యవసాయ అధికారి నరసింహులు పత్తి పంటలో అధిక దిగుబడుల కోసం రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రజిత, గ్రామ వ్యవసాయ అధికారి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆర్‌ఓ యంత్రం వితరణ



ఆర్ఓ యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓలు

నార్పల: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చెల్లెలు మాధవి జ్ఞాపకార్థకంగా మండలంలోని దుర్గంలో ఉన్న మండల ప్రజా పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలకు మంగళవారం సర్పంచ్ సాకే రామాంజనేయులు ఆర్ఓ ప్యూరిఫైర్ యంత్రాన్ని వితరణ చేశారు. మండల విద్యాధికారులు క్రిష్ణయ్య, నారపరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై 25 లీటర్ల సామర్థ్యమున్న యంత్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, గ్రామస్తులు రామ్మోహన్‌రెడ్డి, రామాంజనేయులు, కిరణ్‌కుమార్, మారన్న తదితరులు పాల్గొన్నారు.

రేపు ఐసీడీఎస్ పీడీ తాడిపత్రికి రాక

తాడిపత్రి రూరల్: తాడిపత్రికి గురువారం ఐసీడీఎస్ పీడీ నాగమణి రానున్నారు. పీడీ రాకతో అధికార వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో కొన్ని రోజులుగా చోటు చేసుకున్నా వివాదాస్పద పరిణామాలు, ఫిర్యాదులు, సక్రమంగా రవాణా కాని సరుకులు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని పీడీ రానున్నారని సమాచారం. ఇప్పటికే ప్రాజెక్టుకు సక్రమంగా సరఫరా కానీ గుడ్లు, పాలతో అంగన్‌వాడీ టీచర్లు ఇబ్బందులు పడుతున్నారని పీడీ దృష్టికి వెళ్లింది. ఇంటి అద్దెల విషయంలో జాప్యం జరుగుతుండటం, బడ్జెట్ ఉన్నా అంగన్‌వాడీ టీచర్ల బ్యాంకు ఖాతాల్లో జమ చేయకపోవడంపై కూడా పీడీ తెలిసింది. మొదట తాడిపత్రి పట్టణంలోని ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓతో పాటు సూపర్‌వైజర్లతో సమావేశం కానున్నారు. పలు అంశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేయనున్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ కూడా ఉండవచ్చన్న సమాచారంతో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని క్లస్టర్ల సూపర్‌వైజర్లు సూచిస్తున్నారు. అస్తవ్యస్తంగా తయారైన తాడిపత్రి ప్రాజెక్టుకు పీడీ తనిఖీకి రావడం అటు అధికారులు, ఇటు అంగన్‌వాడీ టీచర్లల్లో ఉత్కంఠ నెలకొంది.

'సూపర్ సిక్స్' అట్టర్ ఫ్లాప్



మహాసభల పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

తాడిపత్రి రూరల్: రాష్ట్రంలో సూపర్ సిక్స్ పథకాలు అట్టర్ ఫ్లాప్ అయ్యాయని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి రంగయ్య విమర్శించారు. పట్టణంలోని రంగప్ప కాలనీలో మంగళవారం 28వ రాష్ట్ర మహాసభలకు సంబంధించిన పోస్టర్ల విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశవ్యాప్తంగా ఓట్ల గోల్‌మాల్‌పై ఆందోళనలు జరుగుతున్నా రాష్ట్రంలో కూటమి నేతలు పట్టించుకోవడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగరంగయ్య, నాయకులు మద్దిలేటి, ఓబులేసు, ఎర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లపై 'విజిలెన్స్' ఆరా



తహసీల్దార్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న విజిలెన్స్ అధికారులు

తాడిపత్రి రూరల్: స్థానిక కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ సోమశేఖర్ నుంచి అక్రమ రిజిస్ట్రేషన్లపై వివరాలను విజిలెన్స్ అధికారులు సేకరించారు. మండలంలోని సజ్జలదిన్నె పరిధిలోని వివాదాస్పద భూముల సర్వే నెంబర్లు అడిగి తెలుసుకున్నారు. వీటిలో కొన్ని భూముల్లో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, వారసులు లేకపోయినా ఇతర పేర్లతో రిజిస్ట్రేషన్లు జరిగాయన్న ఫిర్యాదులు, కోర్టు కేసులు తదితర వాటిని దృష్టిలో ఉంచుకుని వివరాలు ఆరా తీశారు.

ఘనంగా ఏకాదశి పూజలు



పామిడిలో అనంత గజ గరుడ లక్ష్మీనారాయణుడు



చిన్న విఠోబ ఆలయంలో పాండురంగడు



భోగేశ్వరాలయంలో రామలింగేశ్వరుడు



పెద్దవడుగూరులో చెన్నకేశవస్వామి

పామిడి: పట్టణంలోని అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి, భోగేశ్వరాలయం, చిన్న విఠోబస్వామి తదితర ఆలయాల్లో మంగళవారం అజ ఏకాదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. స్థానిక అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణం గావించారు. చిన్న విఠోబ దేవాలయంలో రంగసుభే ఫిర్కా ఆధ్వర్యంలో రుక్మిణీ పాండురంగస్వామి ప్రాకారోత్సవం చేశారు. భోగేశ్వరాలయంలో రామలింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం చేశారు. వెంకటేశ్వర ఆలయంలో వెంకటేశ్వరస్వామికి పూజార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లోని దేవతామూర్తులను శోభాయానంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు హాజరై మొక్కుబడులు తీర్చుకున్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో మంగళవారం శ్రావణమాస బహుళ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అత్త, బావమరిదిపై కొడవలితో దాడి

పెద్దవడుగూరు: మండలంలోని జి.వెంకటాంపల్లికి చెందిన మురళి అనే వ్యక్తి అత్త సాలమ్మ, బావమరిది నరసింహపై మంగళవారం కొడవలితో దాడి చేశాడు. పోలీసుల వివరాల మేరకు.. సాలమ్మ కూతురు వరలక్ష్మితో అదే గ్రామానికి చెందిన మురళి అనే వ్యక్తికి ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఏడు నెలల క్రితం ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో వరలక్ష్మి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో మంగళవారం జరిగిన ఘర్షణలో బావమరిది, అత్తకు గాయాలయ్యాయి. వారిని వెంటనే పామిడికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బైక్ బోల్తా – ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని గుంతకల్లు రోడ్డులో మంగళవారం బైక్ అదుపు తప్పి ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. గుంతకల్లుకు చెందిన రాముడు, వినయ్ బైక్‌లో పని మీద గుత్తికి వచ్చారు. తిరిగి వెళుతున్న సమయంలో రోడ్డు అధ్వానంగా ఉండటంతో.. బైక్ అదుపు తప్పి రోడ్డుపై ఉన్న గుంతలో పడింది. ఘటనలో గాయపడిన ఇద్దరినీ స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

'అమ్మవారి స్థలానికి న్యాయం చేయండి'

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రంలోని గ్రామ దేవత ముసలమ్మ తల్లి ఆలయానికి సంబంధించిన స్థలాన్ని పరిరక్షించాలని ఆలయ కమిటీ వారు విన్నవించారు. మంగళవారం ముసలమ్మ కట్ట వద్ద ఉన్న ముసలమ్మ తల్లి స్థలాన్ని తహసల్దార్ శ్రీధర్‌మూర్తి, అధికారులు పరిశీలించారు. అనంతపురానికి చెందిన వెంకటరాముడు ముసలమ్మ తల్లికు సంబంధించిన 25 సెంట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారని కమిటీసభ్యులు వారికి విన్నవించారు. అక్రమంగా రికార్డుల్లోకి ఎక్కించుకున్న స్థలాన్ని రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుశీల, సూర్యనారాయణరెడ్డి, నందినేని మల్లికార్జున, సాకే రామక్రిష్ణ, పురుషోత్తం, చికెన్ నారాయణస్వామి, పాడరాళ్ల రవీంద్ర, బయపరెడ్డి, లక్ష్మీనారాయణ సర్వేయర్ ప్రతాప్‌రెడ్డి, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్‌పై కేసు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్న బీటర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు.మంగళవారం ఎస్ఐ మాట్లాడుతూ కల్లూరులో అహమ్మద్ వలి ఆన్‌లైన్‌లో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. కేసు నమోదు చేసి, అతడి నుంచి రూ.11 వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొత్త బార్ల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంతకల్లు: గుంతకల్లు ఎక్సైజ్ పోలీసుస్టేషన్ పరిధిలో మూడు కొత్త బార్‌ల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఐ శివసాగర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 26 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28వ తేదీ ఉదయం 8.00 గంటలకు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో డ్రా ద్వారా అర్హులను ఎంపిక చేస్తున్నట్లు వెల్లడించారు. ఆశావహులు రూ.5 లక్షలు దరఖాస్తు ఫీజుతోపాటు రూ.10వేలు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి డ్రాలో పాల్గొలన్నారు.

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలో బార్ ఏర్పాటు కోసం నోటిఫికేషన్ జారీ చేశా మని ఎక్సైజ్ సీఐ ఉమాదేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రేపు వాహనాల వేలం

గుంతకల్లు: ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వివిధ వాహనాలను ఈ నెల 21 (గురువారం)న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ శివసాగర్ మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు రూ.3000 కట్టి ఎంట్రీ పాస్ పొందాలన్నారు. అంతేకాకుండా ఆధార్, పాన్ కార్డు జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు.

మోసం చంద్రబాబు నైజం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, నాయకులు

యల్లనూరు: చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివశంకర్ అన్నారు. మంగళవారం మండలంలోని దంతలపల్లి, నీర్జాంపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో చంద్రబాబు రీ కాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణునారాయణ, రామ్మోహన్, దంతలపల్లి పెద్దిరెడ్డి, బాలవెంకటరెడ్డి, రాజారెడ్డి, నీర్జాంపల్లి గోపాల్, భాస్కర్, వెంకటాంపల్లి శంకర్‌రెడ్డి, కులశేఖర్‌రెడ్డి, సుధాకర్‌నాయక్, జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కర్మాగారాల తనిఖీ



లోలూరు వద్ద ఎరువుల కర్మాగారాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

శింగనమల: మండలంలోని లోలూరు క్రాస్ వద్ద ఉన్న భాస్కర్ ఎరువుల కర్మాగారం, చక్రాయిపేట వద్ద నున్న స్వర్ణభూమి ఎరువుల కర్మాగారాలను మంగళవారం అధికారులు తనిఖీ చేశారు. తహసీల్దార్ శేషారెడ్డి, ఏఓ అన్వేష్‌కుమార్, సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దార్ చంద్రకళ, హెడ్ కానిస్టేబుల్ బాషా తనిఖీలో పాల్గొన్నారు. కర్మాగారాల్లో రికార్డులను పరిశీలించారు. ఎరువులను నాణ్యతగా తయారు చేయాలని సూచించారు.. వారి వెంట వ్యవసాయ , రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యాడికి: మండలంలోని పలు ఎరువుల దుకాణాలను గుత్తి ఏడీఏ వెంకటరాముడు, ఏఓ మహబూబ్‌బాషా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని వెంకట్ ఫర్టిలైజర్స్ దుకాణంలో అనుమతి లేని ఏషియన్ బయోటెక్ కంపెనీకి చెందిన రూ.1.69 లక్షల విలువ చేసే నవారా ఎరువును సీజ్ చేశారు. అనంతరం రాయలచెరువులోని న్యూ లక్ష్మీ వెంకటేశ్వర, శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ఫర్టిలైజర్స్ దుకాణాల్లో రికారులు పరిశీలించారు.

ఎంవీ గ్రీన్ పవర్ యూనిట్‌లో తనిఖీ

తాడిపత్రి రూరల్: పట్టణ సమీపంలోని ఎంవీ గ్రీన్ పవర్ యూనిట్‌ను మంగళవారం డీఎస్ఓ వెంకటేశ్వర్లు, తాడిపత్రి ఏడీఏ రవి, ఏఓ ఆంజనేయులు తదితరులు తనిఖీ చేశారు. సబ్సిడీ యూరియాను యూనిట్‌లో ఉపయోగిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడులు చేశామని అధికారులు తెలిపారు. సబ్సిడీ యూరియా ఉపయోగించలేదని తేలిందన్నారు. యూరియాను అక్రమంగా వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి

బుక్కరాయసముద్రం: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరొకరు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బీకేఎస్ మండలం నీలంపల్లికి చెందిన రాజు (50), గోవిందపల్లి నివాసి ఈశ్వరరెడ్డి మంగళవారం అనంతపురానికి వెళ్లారు. పని ముగించుకున్న అనంతరం గోవిందంపల్లికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన వారు బోయ కొట్టాల వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నారు. ఘటనలో రాజు తలకు తీవ్ర గాయం కాగా, స్వల్ప గాయాలతో ఈశ్వర్‌రెడ్డి బయటపడ్డాడు. అటుగా వెళుతున్న వారు క్షతగాత్రులను అనంతపురంలోని జీజీహెచ్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఆస్పత్రిలో రాజు మృతిచెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.